క్లుప్తంగా

దోషులపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా ఏసుబాబు

దెందులూరు: కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హారికపై హత్యాయత్నం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఏపీ గౌడ సంఘం జిల్లా కార్యదర్శి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా ఏసుబాబు కోరారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. సాక్షాత్తు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌పై హత్యాయత్నం చేసి మూడు రోజులు గడిచినా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామన్నారు.

హ్యాండ్ బాల్ గేమ్ వర్క్‌షాప్ ప్రారంభం



హ్యాండ్‌బాల్ గేమ్ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నతానియేలు

దెందులూరు: హ్యాండ్ బాల్ క్రీడలో ప్రాక్టికల్, థియరీ విభాగాల్లో నాలుగు రోజుల సెక్షన్‌ను సద్వినియోగం చేసుకోవాలని గోపాలపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేలు అన్నారు. సోమవారం గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో లేటెస్ట్ ట్రెండ్స్ ఆన్ హ్యాండ్ బాల్ గేమ్ మీద నాలుగు రోజుల వర్క్ షాప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ బి.కృష్ణదీపిక, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ గన్నవరం పంచాయతీ కార్యదర్శి వలపుల సౌజన్య, ఫార్మర్ నేషనల్ ప్లేయర్, సీనియర్ లెక్చరర్ డాక్టర్ డాక్టర్ దిలీప్ కుమార్ స్వామి డాక్టర్ రత్నబాబు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి.. 10 మంది అరెస్ట్



జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెదపాడు: పేకాట శిబిరంపై దాడి చేసి, వారి నుంచి రూ.27 వేల 630 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గోగుంట గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పెదపాడు మండలంలో ఏ గ్రామంలోనైనా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్నట్లైతే వెంటనే సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రజలకు సూచించారు.

పాఠశాలకు జిరాక్స్ మిషన్ అందజేత

ఉంగుటూరు: బాదంపూడి మెడల్ స్కూలులో సహాయ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ముగ్గళ్ల అరుణకుమారి పాఠశాలకు రూ.20 వేల విలువైన జిరాక్స్ మిషన్‌ను సోమవారం అందజేశారు. హెచ్‌ఎం రేగాని రామకృష్ణ మాట్లాడుతూ పాఠశాలకు జిరాక్స్ మిషన్ అందజేయడం అభినందనీయమన్నారు. అరుణ కుమారి మాట్లాడుతూ జిరాక్స్ మిషన్ పిల్లల ప్రాజెక్ట్ వర్క్‌లకు, వారి విద్యాభివృద్ధికి సహకారంగా ఉంటుందన్నారు.

వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారికి అభినందనలు



అద్దంకి క్విని‌ని అభినందిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: గణపవరానికి చెందిన అద్దంకి జాన్ పీటర్ కుమార్తె అద్దంకి క్విని (7 నెలల చిన్నారి) 262 ఫ్లాష్ కార్డులను గుర్తించి నోబెల్ వరల్డ్ రికార్డు సాధించింది. ఈ నేపథ్యంలో ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కారాలయం వద్ద చిన్నారిని తీసుకొని ఎమ్మెల్యేను పీటర్ కలిశాడు. ధర్మరాజు చిన్నారి ప్రతిభకు అభినందనలు తెలిపారు. ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందుకున్నారు. కూటమి నాయకులు వంగా రఘు తదితరులు పాల్గొన్నారు.

భయం గుప్పెట్లో విధులు

- చిన్నపాటి వర్షానికే శ్లాబ్ నుంచి లీకవుతున్న నీరు
- శిథిలావస్థలో ఎంఆర్సీ భవనం
- ప్రత్యామ్నాయం చూడాలని ఉద్యోగుల వేడుకోలు..
- పట్టించుకోని అధికారులు



భీమడోలు ఎంఆర్సీలో చిన్నపాటి వర్షానికి నీరు చెమర్చుతున్న గోడలు



పసర్లు కమ్మిన ఊచలు



బిక్కుబిక్కుమంటూ విధుల్లో టీచర్లు (ఫైల్)

భీమడోలు: సరస్వతీ నిలయాలకు ప్రధాన కేంద్రమైన భీమడోలు విద్యాశాఖ కార్యాలయం మరమ్మతుల బారిన పడి శిథిలావస్థకు చేరింది. భీమడోలు మండల విద్యావనరుల కేంద్రం(ఎంఈవో) పైకప్పు శ్లాబ్ నుంచి నీరు లీకై పటుత్వం కోల్పోయి పెచ్చులూడి ఇసుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికి కేంద్రంలోని గోడల్లోంచి నీరు చెమర్చి, పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ఆఫీస్ సిబ్బంది, టీచర్లు భయందోళనలతో విధులు నిర్వహిస్తున్నారు. ఎంఆర్సీలో మినీ సమావేశాలు, శిక్షణలు వంటి కార్యక్రమాలు జరుగుతుండడంతో భద్రతాపరమైన ఆందోళనలు ఉపాధ్యాయుల్లో రేకెత్తుతున్నాయి. దీనికి తోడు వర్షాకాలం కావడంతో భవనంలో అంతర్గతంగా నీరు వచ్చి మునుగుతుండడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. రోజు రోజుకూ భవనం పరిస్థితి ప్రమాదకరంగా మారుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం వారిని ఆవేదనకు గురి చేస్తుంది. ఏదైనా శ్లాబ్ ఊడి పడితే తమ పరిస్థితి ఏమిటని ఉపాధ్యాయులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా పైకప్పు నుంచి నీరు లీకై ఎంఆర్సీ భవనం ప్రమాదస్థితికి చేరుకుంది. 16 ఏళ్ల క్రితం రూ.7.5 లక్షలతో నిర్మించిన ఈ భవనంపై పడిన వర్షం నీరు కిందకు వెళ్లే మార్గం లేక నీరు అక్కడే నిలిచి శ్లాబ్ దెబ్బతింది. ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనన్న భయం వారిని వెంటాడుతుంది. ఇదే పరిస్థితి పోలసానిపల్లి గురుకుల కళాశాల భవనాలపై పడిన నీరు కింద వచ్చే మార్గం లేక మే నెలాఖరున రెండు శ్లాబ్‌లు కూలిపోయిన విషయం అందరికి తెలిసిందే. ఆ సమయంలో విద్యార్థులు, అధ్యాపకులు లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది.

ఇక్కడి నుంచే విద్యా శాఖ కార్యక్రమాల పర్యవేక్షణ

విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు ఇక్కడి నుంచే కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలోని పాఠశాలలకు చేరవేసి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. సకాలంలో వాటిని ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో అందజేసే పనుల్లో ఉద్యోగులు, అధికారులు విధుల్లో తలమునకలవుతున్నారు. దీంతో వారంతా బిక్కుబిక్కుమంటూ విధులను నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 42 క్లస్టర్ విధానంలోని పలు రకాల బడుల్లో 3 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వారికి అవసరమైన విద్యా బోధనలో మెలకువలు, విద్యాశాఖ రూపొందించిన కార్యక్రమాలపై 300 మందికి పైగా టీచర్లకు పలు రకాల సమావేశాలు, శిక్షణ తరగతులను ఇక్కడే నిర్వహిస్తారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులు పలు కార్యక్రమాల నిర్వహణలో సతమతమవుతూ ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో కార్యాలయంలో శిక్షణకు వస్తే ఏమి జరుగుతుందోనన్న భయం వారిని వెంటాడుతుంది.

నిధుల లేమి వల్లే ఈ పరిస్థితి

మండల విద్యా వనరుల కేంద్రం భవనం అభివృద్ధి, మరమ్మతులకు ప్రత్యేకంగా గ్రాంట్ విడుదల కాదు. దీంతో మండల పరిషత్ నుంచే నిధులు వెచ్చించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల పరిషత్‌లకు నిధులు జమ కావడం లేదు. దీనితో మండల పరిషత్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు తీవ్ర ఆటంకంగా మారింది. మండల పరిషత్ పరిధిలోని మండల విద్యా వనరుల కేంద్రం మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. వేరే భవనంలోకి మార్పు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు ఎంఆర్సీ మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

> **భవనం శ్లాబ్ నుంచి నీరు లీకవుతుంది**
>
> 
>
> ఎంఆర్సీ స్లాబ్ నుంచి నీరు లీకవుతున్న మాట వాస్తవమే. దీంతో భవనం నుంచి పెచ్చులు ఊడిపోయి శిథిలావస్తకు చేరింది. మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని అధికారులు, పాలకులను కోరాం. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల దర్మరాజు దృష్టికి సమస్యను తీసుకెళితే మరమ్మతులు చేపట్టే వరకు ప్రత్యామ్నయ భవనంలోకి మార్చేలా తగు చర్యలు తీసుకుంటాం. ఆందోళన చెందనవసరం లేదని హామీ ఇచ్చారు.
>
> – ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో–1, భీమడోలు

ఆదాయం ఫుల్.. నిర్వహణ నిల్

- పారిశుద్ధ్య నిర్వహణకు మోటార్ ఆటో రిక్షాలు లేని వైనం



చెత్త సేకరణ బండిని కష్టంగా లాగుతున్న పంచాయతీ కార్మికులు

ఉంగుటూరు: గ్రామ పంచాయతీకి ఆదాయం మెండుగాఉన్నా సొంత మోటార్ ఆటోరిక్షా కాని, ట్రాక్టర్ కాని అధికారులు సమకూర్చలేకపోయారు. దీంతో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రధానంగా పంచాయతీకి సొంత మోటారు ఆటో రిక్షాలు గాని, ట్రాక్టర్‌గాని లేకపోవడం సోచనీయం. కిరాయికి ఒక ట్రాక్టర్‌ను అప్పుడప్పుడూ ఉపయోగిస్తున్నారు. అది వచ్చినప్పుడే చెత్తాచెదారం పూర్తిస్థాయిలో బయటకు వెళుతుంది. పంచాయతీకి ఆదాయం కోటి రూపాయల పైమాటే. అయినా పరిస్థితి దయనీయంగా మారింది. ఆ నిధులు గ్రామంలో మెయింటెనెన్స్‌కు, ఇతర అభివృద్ధి అవసరాలకు సరిపోతుంది. అనుమతులు పొందుతున్న పరిశ్రమలవారిని గాని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారిని గాని అడిగితే ఇచ్చేవారు లేకపోలేదు. గ్రామ పంచాయతీకి సాధారణ రిక్షాలే నేటికీ ఉపయోగిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పారిశుద్ధ్య రిక్షాలను, పంచాయతీ కార్మికులు అతి కష్టంమీద లాగుతున్నారు. ఒక వీధిలో చెత్త కూడా పూర్తి స్థాయిలో తీసుకెళ్లలేకపోతున్నారు. బండి నిండిపోతుంది. గతంలోనే మేలు మోటారు రిక్షాలు ఉండటంతో చెత్తను ఇంటింటికీ అడిగి తీసుకెళ్లేవారు. ఇపుడు ఆ పరిస్థితి కనబడటంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో చెత్తను ఊరి శివారులోకి తీసుకెళ్లడం భారంగా మారింది. చెత్తను ఇళ్ల వద్ద సంచుల్లో పెట్టుకుని ఎదురుచూడటం ప్రజల వంతు అవుతుంది.

బీడు వారిన భూములు



నీరులేక బీటలు వారిన నారుమళ్లు



నీటి కోసం రైతన్న ఎదురుచూపులు

- దెందులూరు నియోజకవర్గంలో నారుమళ్లకు అందని సాగు నీరు
- 450 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం

దెందులూరు: దెందులూరు మండలంలో సాగునీరు అందక నారుమళ్లు ఎండిపోతన్నాయి. పోతునూరు, కేదవరం, గుండుగొలనుతో పాటు దెందులూరు శివారు ప్రాంతాల్లో 450 ఎకరాలకు పైగా పొలాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. గోదావరి కాలువకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఈ పరిస్థితి ఉండటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ఎవరికి చెప్పాలో తెలియక ఎప్పుడు నీళ్లు వస్తాయోనని రైతులు ఎదురుచూస్తున్నారు. అందరూ సన్నా చిన్న కారు రైతులే. ప్రభుత్వం మాత్రం వందల ఎకరాల్లో సాగునీరు లేక పంట ఎండుతున్నా.. పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు కూడా కనీసం ఏం జరుగుతుందో.. పరిశీలన కూడా చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ ఉద్యోగులు పట్టించుకోకపోతే జిల్లా అధికారులకు ఈ విషయం ఏం తెలుస్తుందని.. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో కూడా లేకపోతే తమ సమస్య ఎప్పటికీ పరిష్కారం అవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు.

తూర సైజు పెంచాలి



ఉంద్రాజవరం దగ్గర కొత్తచెరువు బోదె వద్ద తూర పెంచాలి. తూర సైజు చిన్నగా ఉండటం వల్ల సాగునీటి సమస్య తలెత్తింది. సమస్య వెంటనే పరిష్కరించాలి.

చెన్ను లక్ష్మణ, రైతు

50 ఎకరాల్లో సాగునీటి సమస్య



కేదవరం, పోతునూరు, గుండుగొలను గ్రామాల్లో 450 ఎకరాలకు సాగునీటి సమస్య ఉంది. రైతుల సమస్య పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎవరికి చెప్పాలో ఎవరు పరిష్కరిస్తారో అర్థం కావట్లేదు.

మురల సత్యనారాయణ, రైతు

పట్టించుకోని అధికారులు



జిల్లా అధికారులు ఎప్పుడు వస్తారో.. సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారో అర్థం కావడం లేదు. మూడు గ్రామాల్లో సాగునీరు లేకపోతే సమస్య కాదా.. మీరు పట్టించుకోరా?

సరగల స్వామి, రైతు

ఆక్రమణకు గురైన వాగు



వాగును ఆక్రమించేశారు. పంట కాలువలు వెడల్పు చేయాలి. ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు సమష్టిగా పరిశీలించి ఆక్రమణలు తొలగించడానికి ఇబ్బంది ఏంటి?

–పడమట నాగేశ్వరరావు, రైతు

జగన్ రైతును రాజు చేశారు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతును రాజుగా చేశారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయం అనుసంధానం చేశారు. పంట పెట్టుబడి సాయం విధిగా అందించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీడు వారిన భూములకు సాగు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

డీబీఆర్‌కే చౌదరి ,వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి

నాంది ఫౌండేషన్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

భీమడోలు: గుండుగొలను వింధ్యవాసిని మంచి నీటి చెరువు వద్ద ఏర్పాటు చేసిన హైదరాబాద్‌కు చెందిన నాంది వాటర్ ప్లాంట్ యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్ పీజీఆర్‌ఎస్‌లో సోమవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ప్రతులను ఆయన విలేకరులకు అందించారు. వాస్తవానికి గ్రామంలో నాంది వాటర్ ప్లాంట్ నిర్వహించుకునేందుకు గ్రామ పంచాయతీ నుంచి 2014 సెప్టెంబర్ 4వ తేదీ గడువుతో ఎగ్రిమెంట్ పొందారు. అయితే గడువు ముగిసిన వెంటనే ప్లాంట్‌ను పంచాయతీకి అప్పగించి వెళ్లాల్సి ఉండగా పంచాయతీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేయడంతో గతేడాది అక్టోబర్‌లో ప్లాంట్‌ను వదిలి వెళ్లారు. పది సంవత్సరాలు అదనంగా ప్లాంట్‌ను నిర్వహించుకున్నందుకు గాను పంచాయతీకి వారు చెల్లించాల్సిన సొమ్ముల్లో కొద్ది మొత్తాన్ని చెల్లించి మిన్నకుండిపోయారు. రావాల్సిన మొత్తాన్ని రాబట్టే విషయంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పంచాయతీరాజ్ చట్టం మేరకు ప్లాంట్ నిర్వహణ సంస్థపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, బకాయిల వసూలుపై తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించాలని ఆయన ఫిర్యాదు చేశారు.

కోసూరి జయసుధకు కవితా పురస్కారం



హైదరాబాద్ రవీంద్రభారతిలో కవితా పురస్కారాన్ని అందుకొని సత్కారం పొందుతున్న కోసూరి జయసుధ

భీమడోలు: పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎం పురం గ్రామానికి చెందిన ప్రముఖ కవయిత్రి కోసూరి జయసుధ కవితా పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం తెలుగు సాహితీ వనం 8వ వార్షికోత్సవ సభలో 2025 సంవత్సరానికిగాను సాహిత్య పండితురాలిగా ప్రజల్లో చైతన్యాన్ని రగించేలా ఎన్నో కవితలు, రచయినలు చేసిన కోసూరి జయసుధను తెలుగు సాహితీ వనం అడ్మిన్ బృందం 2025వ సంవత్సానికి గాను కవితా పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో తెలుగు సాహితీ వనం సమూహ ప్రతినిధులు శాంతి కృష్ణ, కొలకలూరి ఇనాక్, అంపశయ్య నవీన్, సత్యాజీ చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ కవులు, సాహితీ వేత్తలు ఆమెకు జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

సొసైటీ అధ్యక్షుడిగా గోపాలకృష్ణ

ఉంగుటూరు: బొమ్మిడి సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడిగా మైలవరపు గోపాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా కన్నూరి శ్రీను, నక్క ఆనందరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మరాజు సోదరుడు భీమరాజు, సూరత్తలు అయ్యప్ప, మాజీ జెడ్పీటీసీ కాటి కిరణ్, మంద శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

దెందులూరు: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 15 నుంచి 18 వరకు మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు దెందులూరు, సత్యనారాయణపురం, అలుగులగూడెం, కొమిరేపల్లి, గంగన్నగూడెం, కొత్తగూడెం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ దెందులూరు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

వర్షాకాలం.. విద్యుత్‌తో అప్రమత్తం

- తడిచేతితో స్విచ్‌లు, బోర్డులు ముట్టుకోవద్దు
- సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలి



నగరంలోని అశోక్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వర్షాకాలం ప్రారంభమై దాదాపు నెలరోజులు కావస్తున్నా వర్షాల ప్రభావం పెద్దగా లేదనే చెప్పాలి. అయితే పరిస్థితి ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని వాతావరణం వానాకాలంలోనే ఎక్కువగా చూస్తుంటాం. అప్పుడే ఎండ కాసి, నిమిషాల్లో వాతావరణ మార్పులు చోటుచేసుకుని కారుమబ్బులు కమ్ముకుని భారీ వర్షాలు పడే అవకాశం వానాకాలంలో ఎక్కువగా ఉంటుంది. ఎండల నుంచి ఉపశమనం పొందడానికి వర్షాలు రావాలని కోరుకుంటాం. కానీ ఒక రోజంతా వర్షం కురిస్తే ఎండలే నయమని కూడా అనుకుంటాం. వర్షాకాలం రావాలని ఎంత ఎక్కువగా కోరుకుంటామో అంతే ఎక్కువగా వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ సంస్థ అధికారులు ఈ మేరకు హెచ్చరిస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తే ఈ ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చు. వర్షకాలంలో వానలు, ఈదురు గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు ఒరిగి పోతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా కనిపిస్తుంటాయి. వానలు పడే సమయంలో వీటిని గమనించకపోతే ప్రమాదాలకు గురికావడం ఖాయం. పంట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయో లేదో ఒకటికి రెండు, మూడు సార్లు పరిశీలించుకుని నీటిలోకి దిగాలి. మరో వైపు గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యనే ఉంటాయి. వాటిలో చాలా వాటికి రక్షణ కంచెలు ఉండవు. విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఉండటం, పొలాల్లో వేసిన విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉండటం, మేడలు, మిద్దెలకు సమీపం నుంచే తీగలు వెళ్లడం, స్తంభాలు విరిగిపోవడం, ఒరిగిపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. వర్షాకాలంలో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

చేయకూడని పనులు ఇవే

- వర్షకాలంలో విద్యుత్ స్తంభాలను, స్తంభాలను తాకుతూ వెళ్లే టెలిఫోన్, కేబుల్ టీవీ వైర్లను తాకే ప్రయత్నం చేయకూడదు.
- సబ్ స్టేషన్ వంటి ప్రాంతాల్లో రక్షణ తీగలకు దూరంగా ఉండాలి.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు, మరమ్మతులు చేయకూడదు.

> **ముందస్తు జాగ్రత్తలే రక్షణ**
>
> 
>
> వర్షకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యుత్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. పలుచోట్ల స్తంభాలు పడిపోతాయి. వాటిని మరమ్మతులు చేయించడానికి యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాం. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ముప్పు ఉండదు.
>
> – కేఎం అంబేద్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్

ఇళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు రాకుండా చూడాలి.
- నీరు ఉన్న పరిసరాల్లో విద్యుత్ పరికరాలు ఉంచకూడదు.
- వర్షం కురిసే అవకాశం ఉన్న చోట విద్యుత్ పరికరాలను ఉంచొద్దు.
- చేతులు తడిగా ఉన్నప్పుడు స్విచ్‌లను తాకకూడదు.
- ప్లగ్గను స్విచ్ ఆఫ్ చేయకుండా తీయకూడదు.
- నిపుణులతోనే ఇళ్లకు వైరింగ్ చేయించాలి.

అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం

పెదవేగి: లక్ష్మీపురం గ్రామంలోని అంగలకుదురు హనుమంతు నివాసం సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూ కారణంగా దగ్ధమైంది. ఇంటిలో ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయింది. దాదాపు పది లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ యజమాని అంగలకుదురు హనుమంతు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు మేక లక్ష్మణరావు వీరంపాలెం లక్ష్మీపురం పెదవేగి గ్రామాల పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు అగ్ని ప్రమాద బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేక లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ విషయాన్ని దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి దృష్టికి తీసుకెళతామన్నారు.